వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

మంగళవారం, సెప్టెంబర్ 22, 2026

వైద్యుల కన్నా హెల్త్ మినిస్టర్ నిర్లక్ష్యమే బాధించింది

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజం
- ఆదిలాబాద్ రిమ్స్ దుర్ఘటన మానవ తప్పిదమే
- టూరిజం స్పాట్‌లా వెళ్లి వచ్చారంటూ మంత్రి దామోదర రాజనర్సింహపై ఆగ్రహం
- రేపు ఆదిలాబాద్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించనున్న కవిత
- పార్టీ తరపున రూ. 50 వేల ఆర్థిక సాయం ప్రకటన

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందేభారత్ : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కంటే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైఖరి తీవ్రంగా బాధించిందని మండిపడ్డారు. మంగళవారం ఆమె 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేయడంతో పాటు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

• పర్యాటక ప్రాంతానికి వెళ్లినట్లు వెళ్లి వచ్చారు:

బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన హెల్త్ మినిస్టర్, ఆసుపత్రికి వెళ్లి అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని కవిత విమర్శించారు. పర్యాటక ప్రాంతానికి వెళ్లినట్లు అర్ధగంట సేపు హడావుడిగా వచ్చి వెళ్లిపోయారని, కనీసం ఆసుపత్రి పరిస్థితిపై సమీక్ష కూడా నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంక్యుబేటర్ వార్డులో సరైన ఏసీ మెయింటెనెన్స్ లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని, ఇది కేవలం మానవ తప్పిదమేనని స్పష్టం చేశారు. ఒక్క ఆదిలాబాద్ రిమ్స్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు దయనీయంగా తయారయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల పరిస్థితులపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి 'ఆడిట్' చేయించాలని డిమాండ్ చేశారు.

• మానవత్వం లేని ప్రభుత్వం:

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇద్దరు మైనార్టీలు, ఒక ఆదివాసీ బిడ్డ చనిపోతే, ఆ నిరుపేద కుటుంబాలకు రూపాయి కూడా సాయం



అందించకపోవడం ప్రభుత్వ అమానుషత్వానికి నిదర్శనమని కవిత మండిపడ్డారు. చివరికి మంత్రి పర్యటన, ఫొటోల కోసం అంత్యక్రియలకు తీసుకెళ్లిన పసిబిడ్డ మృతదేహాన్ని మళ్లీ వెనక్కి తీసుకొచ్చారని, అంతకంటే దారుణం మరొకటి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

• రేపు ఆదిలాబాద్‌లో పర్యటన:

బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బుధవారం తాను ఆదిలాబాద్‌కు వెళ్తున్నట్లు కవిత వెల్లడించారు. బాధిత ప్రతి కుటుంబానికి పార్టీ తరపున రూ. 50,000 తక్షణ ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేంత వరకు ప్రజల తరపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి

- కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు
- 102 మంది 'యువ ఆపద మిత్ర' వలంటీర్లకు శిక్షణ పత్రాల అందజేత
- మామునూరు 4వ బెటాలియన్‌లో ఘనంగా ముగిసిన 7 రోజుల శిక్షణా శిబిరం



వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరంగల్ మామునూరులోని 4వ బెటాలియన్ ఆవరణలో గత ఏడు రోజులుగా నిర్వహించిన 'యువ ఆపద మిత్ర' శిక్షణా కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు బెటాలియన్ కమాండెంట్ ఎన్. వి.ఎస్.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణా కార్యక్రమాన్ని అధికారికంగా ముగించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్. వి.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ విపత్తులు, అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో 'ఆపద మిత్ర' వాలంటీర్ల పాత్ర ఎంతో ప్రశంసనీయమైనదని కొనియాడారు. 7 రోజుల పాటు సాగిన ఈ శిక్షణలో విపత్తు నిర్వహణ, ప్రథమ చికిత్స, సహాయక చర్యలపై వాలంటీర్లకు పూర్తిస్థాయిలో అవగాహనతో కూడిన శిక్షణ కల్పించినట్లు తెలిపారు. యువత ఇటువంటి శిక్షణలను సద్వినియోగం చేసుకుని విపత్తు సమయాల్లో తక్షణమే స్పందిస్తూ బాధితులను ఆదుకోవడంలోనూ, సమాజ సేవలోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 102 మంది యువ వాలంటీర్లకు కమాండెంట్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కార్తీక్, రవి, రాజ్ కుమార్, రాంప్రసాద్, బెటాలియన్ అధికారులు, శిక్షకులు, యువ ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

పంజాగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మంగళవారం అమీర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని పంజాగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబొరేటరీ సదుపాయాలు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణతో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన పెంచాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల క్రమబద్ధమైన సంరక్షణ, చిన్నారులకు సకాలంలో టీకాల పంపిణీ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలన్నారు. అంటువ్యాధేతర వ్యాధుల (Non-Communicable Diseases) స్క్రీనింగ్‌ను విస్తృతంగా చేపట్టి, గుర్తించిన రోగుల వివరాలను నమోదు చేసి తగిన చికిత్స అందించాలన్నారు. అలాగే హెచ్ పీవీ వ్యాక్సిన్‌కు అర్హులైన బాలికలను గుర్తించి వారికి వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందేలా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కమలాపూర్ చెరునును పరిశీలించిన సర్పంచ్ పబ్బు సతీష్, ఎస్ హెచ్ఓ నవీన్

కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కమలాపూర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం, గురువారం నిర్వహించనున్న వినాయక నిమజ్జన మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ గారి ఆధ్వర్యంలో పంచాయతీ యంత్రాంగం, అధికారులు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... మండల పరిధిలో సుమారు 60కి పైగా గణనాథుల విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ... నిమజ్జనోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనం ప్రారంభం నుండి పూర్తయ్యేంత వరకు గ్రామ



పంచాయతీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణలో ఉంటారని పేర్కొన్నారు. భక్తులందరూ శాంతియుత వాతావరణంలో, తగిన జాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని జరుపుకోవాలని కోరారు. కమలాపూర్ ఎస్‌హెచ్ఓ నవీన్ నిమజ్జన ప్రాంతాలు, మార్గాలను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వరంగల్ ప్రజలకు నాణ్యమైన యూరాలజీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సేవలు

- డాక్టర్ కౌశిక్ అమంచర్ల
- హైదరాబాద్‌కు వెళ్లే పనిలేకుండా స్థానికంగానే ప్రత్యేక వైద్య సలహాలు
- అత్యాధునిక రోబోటిక్ సర్జరీతో వేగవంతమైన రికవరీ

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరంగల్ ప్రాంత ప్రజలకు అధునాతన యూరాలజీ చికిత్సలు, అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ (సోమాజిగూడ) కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ యూరో-ఆంకాలజిస్ట్ డాక్టర్ కౌశిక్ అమంచర్ల తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ, ప్రోస్టేట్, మూత్రాశయం, మూత్రనాళాల సమస్యలు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు హైదరాబాద్ దాకా వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణులైన వైద్యుల సలహాలు, ముందస్తు పరీక్షలు, ఫాలో-అప్ సేవలు అందించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వెల్లడించారు. యూరాలజికల్ క్యాన్సర్ల చికిత్సలో రోబోటిక్ సర్జరీ ఒక విప్లవాత్మక మార్పు అని డాక్టర్ కౌశిక్ తెలిపారు. 'రోబోటిక్ పార్షియల్ నెఫ్రెక్టమీ' ద్వారా క్యాన్సర్ కణాలను మాత్రమే తొలగించి, ఆరోగ్యకరమైన కిడ్నీ భాగాన్ని కాపాడవచ్చు. ప్రోస్టేట్ క్యాన్సర్: 'రోబోటిక్ రాడికల్ ప్రోస్టటెక్టమీ' ద్వారా అతి తక్కువ రక్తస్రావంతో క్యాన్సర్‌ను తొలగించి, రోగి త్వరగా కోలుకునేలా చేయవచ్చు. సాధారణంగా కిడ్నీ మార్పిడి సర్జరీలు సవాలుతో కూడుకున్నవని, అయితే యశోద హాస్పిటల్స్‌లో 81 ఏళ్లు, 71 ఏళ్ల వయస్సు గల జీవించి ఉన్న వృద్ధ దాతల నుంచి కూడా సేకరించి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. సరైన ప్రీ-ఆపరేటివ్ పరీక్షలు,



అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమన్వయంతో ఇది సాధ్యమైందని చెప్పారు. మినిమల్లీ ఇన్వేసివ్ (తక్కువ కోత) సర్జరీల వల్ల శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గి, రోగులు త్వరగా సాధారణ జీవనానికి తిరిగొస్తారని వివరించారు. కిడ్నీ, ప్రోస్టేట్ క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని, ప్రజల్లో యూరాలజికల్ వ్యాధులపై అవగాహన పెంచడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కార్పొరేట్ రిలేషన్స్ విభాగ ప్రతినిధులు పాల్గొన్నారు.